


మొదటి ఉత్తరం డిక్టేట్ చెయ్యటం అయిపోయింది రెండవది డిక్టేట్ చేస్తున్నాడు అమరేంద్ర తన స్టెనోకి. "విత్ రెఫరెన్స్ టు యువర్ లెటర్ డేటెడ్....డేటెడ్...." యిలా చెప్పిందే చెప్పి ఒక్క నిమిషం ఆగాడు అమరేంద్ర.

మొదటి లెటర్ డిక్టేట్ చేస్తూండగా కూడా ఒకటి రెండుసార్లు పరధ్యానంగా చెప్పిందే చెప్పటం వలన ఆమె తలెత్తి చూసింది. ఆ వెంటనే సర్దుకుని గబగబా మిగతాది పూర్తిచేశాడు. కానీ ఈసారి ఆమె తలెత్తి అతనికేసి చూడలేదు. నెయిల్ పాలిష్ వేసుకున్న తన గోళ్ళకేసి చూసుకుంటూ వుండిపోయింది. అమరేంద్ర అంతటితో ఆపేసి, కిటికీ రెక్క మీద తన కుడి చెయ్యి నానించి, బైటికి చూస్తూ అలాగే నిలబడిపోయాడు. కిటికీకి అవతలగా, కేన్నాస్, దేలియా, బోగన్ విల్లా, ఒక దానితో ఒకటి పోటీ పడినట్టు విరగబూసి వున్నాయి. రెండు నిమిషాలాగి, ''సారీ ఏం చెప్పాను?'' అన్నాడు.

''....యువర్ లెటర్ డే...'' అంది తల వంచుకునే.

''యస్ టేక్ డౌన్'' అని మళ్లీ కొంచెంసేపాగి ''చూడండి శోభాదేవీ మీతో ఒక మాట చెప్పాలి, ఇంత కాలంగా నా మనసులోని మాటని ఎప్పటి కప్పుడు మీకు చెప్పాలనుకుని ఈరోజు వరకూ సాహసించలేక పోయ్యాను. ఇది చెప్పే ముందు యింకో విషయం మిమ్మల్నడగాలనుకుంటున్నాను. మీ పుట్టిన రోజు కానుకగా ఆ ఎర్రగులాబీల గుత్తిని నిన్న మీకిస్తే దాన్ని మీరు తీసుకోకుండా ఎందుకింత నిర్దాక్షిణ్యంగా నా టేబిల్ మీద ఫ్లవర్‌వాజ్‌లో వుంచేసి వెళ్ళారు? మీ ఈ చర్య చూశాక నా మనసంతా అందోళనతో నిండిపోయింది. అయినా సరే ఎంతకాలం ఈ కోరికను బలవంతంగా నిగ్రహించుకుని ఆ భారాన్ని మొయ్యను? నావల్ల కావటంలేదు శోభా: మీకిష్టం అవుతే....మీరు మనఃస్ఫూర్తిగా అవునంటే నేను....'' అని అమరేంద్ర అంటూండగానే యింకా ఆ వాక్యం పూర్తిచెయ్యక ముందే ''వొద్దు....వొద్దు యింకేమీ చెప్పకండి నాకు'' అని కుర్చీ లోనుండి ఒక్క వుదుటున లేచి తన రూమ్‌లోనికి పారిపోయింది శోభ. ఆమె కళ్ళల్లోని నీళ్ళనీ, మొహంలోని ఆందోళననీ చూచి అచేతనంగా నిల్చుండిపోయాడు అమరేంద్ర.

మరునటి రోజు ఆఫీసుకి రాగానే ప్యూన్ ఒక ఉత్తరం తెచ్చిచ్చాడు అమరేంద్రకి. అర్జంటుగా వూరు వెళ్ళవలసొచ్చిందనీ, ఒక వారం రోజులు సెలవు గ్రాంట్ చెయ్యవంపిందనీ కోరుతూ, సెలవు చీటీ వ్రాసి పంపింది శోభ. సెలవు గ్రాంట్‌చేసి, ఆఫీసు పనిని తనూ టైపిస్టూ కలిసి పూర్తిచెయ్యాలని నిశ్చయించుకున్నాడు. నాలుగో రోజున బలరాం ఉత్తరం రాశాడు. కొత్తగా బిజినెస్ పెట్టబోతున్నాననీ. ఆ వ్యవహారాల్లో సలహా యివ్వటానికి వెంటనే బైలుదేరి బెంగుళూరు రమ్మనీ. వెంటనే బైలుదేరాడు అమరేంద్ర.

మొదటిరోజు బిజినెస్ వ్యవహారాలు మాట్లాడంతోటే సరిపోయింది స్నేహితులిద్దరికీ. రెండివ రోజు యింగ్లీషు పిక్చర్‌కి వెళ్ళి, తర్వాత ఏదైనా మంచి హోటల్లో భోజనంచేసి రావాలనుకుని బైలుదేరారు. ఏం చేస్తున్నా, ఎక్కడ తిరుగుతున్నా శోభమ గూర్చిన జ్ఞాపకమే వెన్నాడుతూండేంది అమరేంద్రను.

పిక్చర్ నుండి బైటికి వచ్చాక "రావోయ్ యివ్వాళ నిన్ను "కేబరే"కి తీసుకు వెళ్తాను, నీ పరధ్యానమూ, నిరుత్సాహమూ దెబ్బతో ఎగిరిపోతాయి అని అమరేంద్రను లాక్కు వెళ్లాడు బలరాం.

బెంగుళూరు సిటీలో నవ నాగరికుల మనుకునే వాళ్లూ, సంఘంలో పైమెట్టు మీద నున్న వ్యక్తులూ, రాళ్లూ యిటుకలకి బదులుగా రూపాయి నాణాలు ఒక దానిపైన ఒకటి పేర్చి భవనాలు కట్టించుకోగలిగినంత "నల్ల ధనం" వున్న వాణిజ్య వేత్తలూ, పావనం చేసే చోటు అ హోటల్. బైట పెద్ద డోమ్ వున్న దీపం క్రింద ఒక గుండ్రటి నీళ్ళతొట్టిలో ఒక పాలరాతి శిల్పం అమర్చబడి వుంది. నీటి కుండను తలమీద వుంచుకుని ఎడం చేత్తో సుకారంగా పట్టుకున్నట్టు మలచబడిన స్త్రీ విగ్రహం అది. ఆ కుండలోంచి నీరు పైకి చిమ్ముతూంది. ఆ నీటి తుంపరలు పైనున్న దీపపు కాంతిలో క్షణంసేపు వజ్రాల్లా మెరిసి క్రిందికి రాలి పోతున్నాయి. హాలు దాటి లోనికి వెళ్ళే దారిలో ఫోం రబ్బర్ పాడింగ్ వున్న తివాసీ పర్చబడి వుంది. దాని మీధ అడుగు పెట్టగానే కాలు నాలుగంగుళాలు క్రిందికి దిగిపోతూ నడుస్తూంటే గమ్మత్తుగా అన్పిస్తూంది. ఆ గదంతా సుతిమెత్తటి కాంతితో అంటే సబ్ డ్యూడ్ లైటింగ్‌తో నిండి వుంది. వెయిటర్లు నిశ్శబ్దంగా అటూ యిటూ తిరుగుతూ సర్వ్ చేస్తున్నారు వచ్చిన వాళ్ళకి.

భోజనం అయ్యాక ప్రక్కనే వున్న రూంలోనికి దారితీశాడు బలరాం. దీపాల వెలుతురులో అక్కడున్న డాన్సింగ్ ఫ్లోర్ తళ తళలాడుతూంది. ఫ్లోర్‌కి ఒక ప్రక్కగా నలుగురైదుగురు ఏవేవో వాయిద్యాలు వాయిస్తున్నారు. మెల్లిగా ఒక్కొక్కరే వచ్చి అక్కడున్న సీట్లలో కూచోసాగారు. గంట పదకొండు కావస్తూండగా ఫ్లోర్ మీద వెలుగుతూన్న పెద్ద లైటు ఆరిపోయింది. ఆ తర్వాత ఆర్కెస్ట్రా ఆగిపోయింది. వెనువెంటనే మైక్‌లో ఎనౌన్స్ మెంట్ విన్పించింది. "నౌ యిట్స్ కేబరే టైమ్ ఎండ్ వి ప్రెజెంట్ యు టు నైట్ 'లోలా'ద ఛా ఛా ఛా క్వీన్" అని. అంతలో ఏదో భారీ వస్తువు దబుక్కున క్రిందికి పడితే ఎంత శబ్దం ఈస్తుందో అంత శబ్దంతో ఆర్కెస్ట్రా ఖంగ్‌మంది. వెను వెంటనే ఫ్లోర్ మీది లైటు వెలగటమూ, నెమలి కంఠం రంగు సిల్కు శాలువ కప్పుకున్న ఒక నర్తకి అక్కడికి వచ్చి ఆర్కెస్ట్రా వాయిస్తూన్న పాశ్చాత్య సంగీతాని కనుగుణంగా నృత్యం చెయ్యటమూ జరిగింది డాన్స్‌లో కదిలికలు వేగంగా వుండటం వలన ఆ యువతి రూపు రేఖలు సరిగ్గా తెలియటం లేదు. కానీ, ఆ దీపాల వెలుతుర్లో రంగు వేసుకున్న పెదవులూ కంటి పై రెపరీ రాసుకున్న గోల్డ్ డస్ట్, చెవలర్ మెడలోనూ వ్రేలాడుతున్న చవకబారు రాళ్ళ నగలు జిగేల్‌మంటున్నాయి. తల ఎగుర వేసినప్పుడల్లా జుట్టు మొహం మీదకి జూలులాగా పడ్తోంది. అయిదు నిమిషాలు అయ్యాక ఆ యువతి షాల్‌ని పక్కకి జారవిడిచింది. వక్షం మీద, నడుం క్రింది భాగానా, అరచేయంత బట్ట తప్ప మిగతా శరీరం అంతా అనాచ్ఛాది

తంగానే వుంది. ఇంతవరకూ నిశ్శబ్దంగా వున్న హాల్లో నవ్వులూ, గుస గుసలూ ప్రారంభమయ్యాయి. ఏవగింపుతో కళ్లు మూసుకుని కుర్చీకి జారగిల బడ్డాడు అమ రేంద్ర. అతడికి ఒళ్ళంతా కంపరంగానూ నిప్పుల మీద కూచున్నట్టుగానూ వుంది. అలా ఎంతసేపు గడిచిందో తెలీదు. "అయిపోయింది యిక పోదాం రా" అన్న బలరాం పిలుపుతో సీటులోంచి ఒక్క వుదుటున లేచి యివతలకి వచ్చాడు అమరేంద్ర.


ఆవేళ అమరేంద్ర తన ఆఫీసుకి వచ్చి పని చూచుకుంటున్నాడు. ఇంకా శోభ డ్యూటీలో జాయిన్ అవటానికి ఒకరోజు వ్యవధి వుంది. రెండు రోజులు వూళ్లో లేనందువల్ల చెయ్యవలసినవి చాలా పను లున్నాయి. ప్రయాణం మూలాన బడలిక కూడా ఎక్కువగా వుంది. అయినా ఓపిక తెచ్చుకుని ఆరోజు పోస్టులో వచ్చిన ఉత్తరాలని చదువసాగాడు. ఆ ఉత్తరాల దొంతరలో అడుగున వుండిపోయిన శోభ దస్తూరితో వున్న వుత్తరం కన్పించగానే గబగబా చింపి చదువసాగాడు...

శ్రీ అమరేంద్రగారికి,

ఈ ఉత్తరంలోని విషయాలు నానోటి తోనే మీకు చెప్పాలని యిన్ని రోజులుగా అనుకుంటూన్నా అందుకు తగిన అవకా శమూ, సాహసమూ ఈ రెండూ లేక పోయాయి. నేను మీవద్ద స్టెనోగా పని చేస్తున్నా రాత్రి వూట క్లబ్ డాన్సర్ని! మీరు నామీద ఆశలు పెంచుకుంటున్నారని తెలిసి నేను మీనుండి దూరంగా జరు గుతూ వచ్చాను. మీవంటి ఉత్తములకి నాలాటి స్త్రీ భార్యగా రావటం ఎవరు సహించినా నేను మాత్రం సహించలేను.

మెరిసేదంతా బంగారం కానట్టే మా నవ్వుల వెనుకా, తళుకుల వెనుకా, ఎన్ని కన్నీళ్ళు ఎన్ని వేడి నిట్టూర్పులు దాగి వున్నాయో ఎంతమందికి తెలుసును·ఉన్న డబ్బును ఏ విధంగా ఖర్చు చెయ్యాలో తెలీని వాళ్ళక్కడికి వస్తే, మాడే కడుపు లతో వున్న మేము చిరునవ్వులని మొహా లకతికించుకుని వ్నాని నవ్వించి, కవ్వించి హుషారెక్కించాలి! వింతగా లేదూ·

బరువు బాధ్యతలు విస్మరించిన వ్యక్తి మా నాన్న. అమ్మ గుండె జబ్బు మనిషి, నాకొక తమ్ముడున్నాడు. నాన్న పేకాటకీ, త్రాగుడుకీ ఎక్కడి డబ్బు సరిపోయ్యేది కాదు. ఇంట్లో శాంతి అన్నది ఏనాడు నశించింది. ఇలాంటి పరిస్థితుల్లో కష్టపడి స్కూల్ ఫైనల్ పాసై. ఒక సర్టిఫికెట్ సంపాదించాను కానీ డిగ్రీలున్న వాళ్ళకీ దిక్కులేని ఈ రోజుల్లో నాకు ఎన్నిచోట్ల తిరిగినా వుద్యోగం దొరికింది కాదు. అమ్మ ట్రీట్మెంట్ లేకుండా మంచం మీద పడుకుని మూలుగుతూ వుంటే, విన్న నాకు గుండె తరుక్కుపొయ్యేది. నానాటికి దుర్భరం అయిపోతూన్న ఆ పరిస్థితుల్లో ఒకరోజు ఒక లోకల్ న్యూస్ పేపర్ లోని ఎడ్వర్టైజ్మెంట్ నన్నాకర్షిం చింది. అది ఒక ప్రముఖ హోటల్ వాళ్ల డాన్సర్ కోసం చేసిన ప్రకటన. వెంటనే ఎప్లయ్ చేశాను. వెయ్యి రూపాయల జీతం మీద నన్ను తీసుకున్నారు. కానీ అమ్మకి ఈ విషయం చెప్పకుండా దాచాను కానీ నాన్నకెలాగ తెలిసిందో కానీ, తెలి




సిన వెంటనే చేస్తూన్న వుద్యోగానికి రాజీనామా యిచ్చేసి ప్రతిరోజూ రాత్రి నాతో పాటు క్లబ్‌కి వచ్చి చిత్తుగా త్రాగేవాడు. కానీ నాకా జీవితం అంటేనే మొదటి రోజు నుండీ జుగుప్స ఏర్పడింది. ఆ రోజుల్లోనే టైప్, షార్ట్‌హాండ్ నేర్చుకుని పాసయ్యాను. హోటల్ మేనేజ్‌మెంట్ వాళ్ళే రెకమెండ్ చేసి నాకు మీ ఆఫీసులో వుద్యోగం యిప్పించారు. చేరేటప్పుడు వాళ్ళకి నేను మూడేళ్ల కంట్రాక్టు వ్రాసిచ్చాను. ఇక ఆరు నెలలు మాత్రం వుంది. మొన్న మా హోటల్ వాళ్ళు వాళ్ళ బెంగుళూరు బ్రాంచికి వెళ్లి రమ్మని కోరటం వలన నేను సెలవు పెట్టి వెళ్ళవలసి వచ్చింది. ఆరోజు బెంగుళూరు హోటల్లో మిమ్మల్ని చూడగానే ఒక్కక్షణం నాగుండె లయ తప్పింది! కానీ ఆ రోజు మీరు నన్ను ఆ డ్రెస్‌లో, ఆ మేకప్‌లో గుర్తు పట్టినట్టు లేదు ఒకవేళ గుర్తుపట్టి వున్నా నేను సంతోషించి వుండే దాన్ని. కారణం మీరు నన్నవహించుకోవాలనీ, నాకు దూరంగా జరగాలనీ కోరుతున్నాను గనుక! ఆఖరి మెట్టు మీదున్న నేను మిమ్మల్ని ఏనాటికీ చేరుకోలేను. మీరు నన్ను మర్చిపోవాలని కోరుతున్నా నీ సమయంలో అందుకే రిజైన్ చేసి దూరంగా వెళ్లి పోతున్నాను. మీకు వుజ్వలమైన భవిష్యత్తు వుండాలనీ, జీవితంలో అన్ని శుభాలూ కలుగాలనీ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

సెలవు,
శోభ.

చాలారోజులకి అతడి కళ్లు తడి అయ్యాయి. వేడి నిట్టూర్పొకటి హృదయాన్ని చీల్చుకుని బైటికి వచ్చింది. *